ప్రజా రిపబ్లిక్

ప్రతి అక్షరం ప్రజల కోసం

RNI No:/2023/87888


పేజీలు : 4 సంపుటి : 01 - సంచిక 173 ఆంధ్ర ప్రదేశ్ , తెలంగాణ బుధవారం 25- 9 - 2024 వెల - 2

Digital Edition



GV MALL
shop & celebrate
TELANGANA | ANDHRAPRADESH | KARNATAKA


# ఏపీలో నామినేటెడ్ పదవుల జాతర..



**సీట్లు త్యాగం చేసిన వారికి బంపర్ ఆఫర్..**

**20 కార్పొరేషన్లతో పాటు మొత్తం 99నామినేటెడ్ పోస్టులు భర్తీ**

**గత ఎన్నికల్లో టిక్కెట్లు ఇవ్వలేనివారికి పొత్తుల్లో టిక్కెట్లు త్యాగం చేసిన వారికి ప్రాధాన్యం**

2లో

కూటమి ప్రభుత్వంలో నామినేటెడ్ పదవుల జాతరకు తెరలేచింది. వంద రోజుల పాలన పూర్తిచేసుకున్న వేళ 20 కార్పొరేషన్లతో పాటు మొత్తం 99నామినేటెడ్ పోస్టులు భర్తీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులిచ్చింది. గత ఎన్నికల్లో టిక్కెట్లు ఇవ్వలేనివారికి పొత్తుల్లో టిక్కెట్లు త్యాగం చేసిన వారికి ప్రాధాన్యం దక్కింది. అలాగే కూటమి గెలుపు కోసం క్షేత్ర స్థాయిలో కష్టపడిన వారికి పదవులు కట్టబెట్టారు. కీలకమైన పోస్టుల భర్తీలో పీటముడి వీడకపోవడంతో ఇన్ని రోజులు వాయిదా వేస్తూ వచ్చారు. పలు దఫాలుగా సమావేశమైన కూటమి నేతలు చర్చించుకొని ఏకాభిప్రాయానికి వచ్చారు.

సెప్టెంబర్ 24, రిపబ్లిక్ న్యూస్.



# దుర్గ గుడి మెట్లు శుభ్రం చేసిన పవన్ కల్యాణ్!

తిరుమల సెప్టెంబర్ 24, రిపబ్లిక్ న్యూస్.

తిరుమల లడ్డూ కల్తీ ఘటన నేపథ్యంలో ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ప్రాయశ్చిత దీక్ష చేపట్టిన విషయం తెలిసిందే. దీనిలో భాగంగా విజయవాడ ఇంద్రకీలాద్రి పై ఉన్న కనక దుర్గ ఆలయంలో ఆయన శుద్ధి కార్యక్రమం నిర్వహించారు.

ఆ తరువాత ఆయన మెట్లను శుభ్రం చేశారు. ఆ మెట్లకు పసుపు రాసి కుంకుమ బొట్లు పెట్టారు. వేద పండితుల మంత్రోచ్ఛారణల మధ్య ఈ కార్యక్రమం నిర్వహించారు.

2లో

## మైనారిటీల సంక్షేమం కోసం బృహత్ ప్రణాళిక.

**న్యాయశాఖ లో మరింత పటిష్టతకు కార్యాచరణ.**

**ప్రకటించిన సీఎం చంద్రబాబుకు కృతజ్ఞతలు.**

**రాష్ట్ర మైనార్టీ సంక్షేమ న్యాయ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్.**



అమరావతి సెప్టెంబర్ 24, రిపబ్లిక్ న్యూస్. రాష్ట్రంలోని మైనార్టీల సంక్షేమం కోసం బృహత్ ప్రణాళిక అమలు దిశగా చర్యలు చేపట్టాలని, న్యాయశాఖలో మరింత పటిష్టతకు కార్యాచరణ రూపొందించాలని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వరాల జల్లులు ప్రకటించినందుకు కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు రాష్ట్ర మైనారిటీ సంక్షేమ న్యాయశాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ మంగళవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సైకో జగన్ ప్రభుత్వ పాలనలో అన్ని వ్యవస్థలను నిర్వీర్యం అయ్యాయని ధ్వజమెత్తారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన కేవలం వంద రోజుల్లోనే ఇది మంచి ప్రభుత్వంగా ప్రజలంతా మెచ్చుకునే విధంగా అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేయడం జరిగిందని పేర్కొన్నారు.

2లో



# మూసీ రివర్ ఫ్రంట్ ప్రాజెక్ట్ బాధితులకు ఊరట..

హైదరాబాద్ ప్రతినిధి, సెప్టెంబర్ 24, రిపబ్లిక్ న్యూస్. హైదరాబాద్‌లో చెరువుల పరిరక్షణే లక్ష్యంగా ఏర్పాటైన 'హైడ్రా' మరోసారి దూకుడు ప్రదర్శిస్తున్న విషయం తెలిసిందే. చెరువు ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌లో అక్రమంగా నిర్మించిన రూ.కోట్ల విలువైన విల్లాలను నేలమట్టం చేస్తోంది. మూసీ రివర్ ఫ్రంట్ ప్రాజెక్ట్ అభివృద్ధిలో భాగంగా నిర్వాసితులయ్యే 16వేల బాధిత కుటుంబాలకు డబుల్ బెడ్ రూం గృహాలను కేటాయిస్తూ తెలంగాణ ప్రభుత్వం ఇవాళ( మంగళవారం) ఉత్తర్వులు జారీ చేసింది.మూసీ రివర్ బెడ్, బఫర్ జోన్‌లో ఉన్న నిర్మాణాలకు పునరావాసం కల్పించేందుకు వీటిని ఉపయోగిస్తారని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వెల్లడించారు. ఇప్పటికే అధికారులు చేపట్టిన సర్వే ప్రకారం 10,200 మందిని నిర్వాసితులుగా గుర్తించారు. రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్.. మూడు జిల్లాల కలెక్టర్ల ఆధ్వర్యంలో అధికారుల బృందాలు రేపు(బుధవారం) ఇంటింటికీ వెళ్లి అక్కడున్న ప్రజలకు ఎక్కడెక్కడ డబుల్ బెడ్ రూం ఇళ్లను కేటాయించారో అధికారులు తెలియజేయనున్నారు.

-మిగతా2లో

## రాజ్యసభ సభ్యత్వానికి ఆర్.కృష్ణయ్య రాజీనామా..

**వైసీపీ నుంచి 2022లో ఆర్.కృష్ణయ్య రాజ్యసభకు ఎన్నికయ్యారు.**



రాజ్యసభ సభ్యత్వానికి బీసీ సంక్షేమ సంఘం జాతీయ నేత ఆర్.కృష్ణయ్య రాజీనామా చేశారు. నిన్న ఆర్.కృష్ణయ్య రాజీనామా లేఖను రాజ్యసభ ఛైర్మన్‌కు పంపగా, దాన్ని ఛైర్మన్ ఆమోదించారు. వైసీపీ నుంచి 2022లో ఆర్.కృష్ణయ్య రాజ్యసభకు ఎన్నికయ్యారు.

తన పదవీ కాలం మరో నాలుగేళ్లు ఉండగానే ఆయన రాజీనామా చేయడం గమనార్హం. ఇప్పటికే రాజ్యసభ సభ్యత్వాలకు బీద మస్తాన్‌రావుతో పాటు మోపిదేవి వెంకటరమణ కూడా రాజీనామా చేసిన విషయం తెలిసిందే.

బీసీ ఉద్యమాన్ని ఉద్ధృతం చేసేందుకే రాజీనామా చేసినట్లు ఆర్.కృష్ణయ్య తెలిపారు. రాజకీయాలకు అతీతంగా తెలంగాణలో బీసీ ఉద్యమాన్ని విస్తరించడంపై ఆర్.కృష్ణయ్య దృష్టిపెట్టారు.

కాగా, ఆర్.కృష్ణయ్య త్వరలోనే బీజేపీలో చేరతారని ఇటీవల ప్రచారం జరిగింది. తెలంగాణలో బీసీ ఓటు బ్యాంకును మరింత పెంచుకునే దిశగా బీజేపీ దృష్టి సారించింది. దీంతో ఆర్.కృష్ణయ్యతో బీజేపీ చర్చలు జరిపినట్లు తెలుస్తోంది.

బీజేపీలో ఆర్.కృష్ణయ్యకు కీలక పదవి ఇచ్చే అవకాశం ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. గతంలో ఆర్ఎస్ఎస్‌లోనూ కృష్ణయ్య పనిచేశారు. కాగా, కృష్ణయ్య 2014 ఎన్నికల్లో టీడీపీ ఎమ్మెల్యేగానూ ఎల్బీనగర్ నుంచి గెలిచిన విషయం తెలిసిందే. ఆ సమయంలో ఆయనను టీడీపీ సీఎం అభ్యర్థిగా ప్రకటించింది.

## రాజకీయాలకు అతీతంగా ఆలయాల పవిత్రతను కాపాడాలి..



సింహాద్రి అప్పన్న వెలసిన సింహాచలం దేవస్థానంలో సంప్రోక్షణ నిర్వహించారు. దేవస్థానం అధికారులు ఆలయ శుద్ధి కార్యక్రమాన్ని చేపట్టారు. దేవాలయంలో అర్చక స్వాములు సంప్రోక్షణను పూర్తి చేశారు. సింహాద్రి అప్పన్న స్వామి వారి సన్నిధిలో జరిగిన సంప్రోక్షణ శాంతి హోమం లో ఎమ్మెల్యేలు గంటా శ్రీనివాసరావు, పంచకర్ల రమేష్ బాబు, గణబాబు పాల్గొన్నారు. ఇప్పటికే సింహాచలం లడ్డుప్రసాదంలో వినియోగించిన నెయ్యిపై ఎమ్మెల్యే గంట అనుమానాలు వ్యక్తం చేసిన సంగతి తెలిసిందే. జంగారెడ్డి గూడానికి చెందిన రైతు డైరీ నెయ్యి శాంపిల్స్ లో సేకరించి ఫుడ్ సేఫ్టీ అధికారులు ల్యాబ్ కు పంపించారు. అప్పటికే స్టోర్ లో స్టాక్ ఉన్న నెయ్యి డబ్బాలను సీజ్ చేశారు.

**సిట్ నిగ్గు తేలుస్తుంది..**

గత పాలకుల నిర్లక్ష్యం, తప్పిదాల వల్ల రాష్ట్ర వ్యాప్తంగా దేవాలయాల్లో సంప్రోక్షణ, శాంతి హోమాలు చేయాల్సి రావడం దురదృష్టకరమని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ఆవేదన వ్యక్తం చేశారు. సింహాచలం దేవస్థానంలో జరిగిన శాంతి హోమంలో ఎమ్మెల్యేలు పంచకర్ల రమేష్ బాబు, గణబాబులతో కలిసి పాల్గొన్న అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు.

# 'అమరావతిలో వంద ఎకరాల్లో అంతర్జాతీయ లా కాలేజీ'.. సీఎం

అమరావతి, సెప్టెంబర్ 24: రిపబ్లిక్ న్యూస్. అంతర్జాతీయ ప్రమాణాలతో అమరావతిలో అత్యుత్తమ లా కాలేజీని ఏర్పాటు చేస్తామని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు తెలిపారు. బెంగళూరులోని నేషనల్ లా స్కూల్ ఆఫ్ ఇండియా యూనివర్సిటీ, గోవాలోని ఇండియా ఇంటర్నేషనల్ యూనివర్సిటీ ఆఫ్ లీగల్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ మాదిరి ప్రతిష్ఠాత్మక సంస్థల తరహాలో ఈ కాలేజీని నిర్మించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. అమరావతిలో 100 ఎకరాల విస్తీర్ణంలో బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ట్రస్ట్ ద్వారా ఇంటర్నేషనల్ లా స్కూల్ ఏర్పాటు చేసే విషయాన్ని ముందుకు తీసుకెళ్లాలని చంద్రబాబు అధికారులకు సూచించారు. ఈ మేరకు ప్రక్రియను వేగవంతం చేయాలని ఆయన ఆదేశించారు. సెప్టెంబర్ 23న సచివాలయంలో న్యాయశాఖపై సీఎం చంద్రబాబు అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్షలో పలు కీలక అంశాలపై అధికారులతో ఆయన చర్చించారు.

అలాగే ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటుకు కేంద్రానికి ప్రతిపాదన పంపుతామన్నారు. ఇందుకోసం త్వరలోనే మంత్రివర్గ సమావేశంలో తీర్మానం ప్రవేశపెడతామని సీఎం చంద్రబాబు వెల్లడించారు. అలాగే జూనియర్ లాయర్లు వృత్తిలో నిలదొక్కుకునేందుకు వారికి నెలకు రూ.10 వేల చొప్పున గౌరవ వేతనం ఇచ్చే ప్రక్రియను కూడా ప్రారంభించాలని అధికారులకు సూచించారు. జూనియర్ లాయర్ల గౌరవ భృతికి సంబంధించిన విషయాన్ని కూడా ఎన్నికల మేనిఫెస్టోలో బాబు పేర్కొన్న సంగతి తెలిసిందే. వీటన్నింటితోపాటు జూనియర్ లాయర్ల శిక్షణ కోసం అకాడమీ ఏర్పాటుకు సన్నాహాలు ప్రారంభించాలని అధికారులను ఆదేశించారు.



## ఏపీలో మొట్టమొదటి వాల్మీకి రీసెర్చ్ సెంటర్..

**పోస్టర్ రిలీజ్ చేసిన మెగాస్టార్ చిరంజీవి..**




ప్రపంచంలో ఎక్కడా లేనివిధంగా విజయనగరం జిల్లాలో మొట్ట మొదటి వాల్మీకి రీసెర్చ్ సెంటర్ ప్రారంభం కానుంది. ఈనెల 27న మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్య నాయుడు ఈ రీసెర్చ్ సెంటర్ ను ప్రారంభించనున్నారు. ఉత్తరాంధ్ర అయోధ్యగా పిలిచే రామనారాయణంలో ఏర్పాటు చేస్తున్న వాల్మీకి రిసెర్చ్ సెంటర్ ప్రారం భానికి సంబంధించిన వాల్ పోస్టర్ ను మెగాస్టార్ చిరంజీవి ఆవిష్క రించారు. రామనారాయణంలో ప్రారంభం కానున్న వాల్మీకి రిసెర్చ్ సెంటర్ ను జాతీయ సంస్కృత యూనివర్శిటి తో అనుసం ధానం చేశారు నిర్వాహకులు. ఈ వాల్మీకి రిసెర్చ్ సెంటర్ టిటిడి సంస్కృ త యూనివర్శిటి పర్యవేక్షణలో సాగుతుంది. ఇక్కడ టిటిడి సంస్కృత యూనివర్శిటికి చెందిన అధ్యాపకులు నిరంతరం అందుబా టులో ఉంటారు. ఈ రీసెర్చ్ సెంటర్ లో తెలుగు, హిందీ, ఇంగ్లీష్, సంస్కృ తంకు చెందిన నాలుగు భాషల రామాయణ గ్రంధాలు, రచ నలు, పాఠ్యపుస్తకాలతో పాటు శ్రీరామునికి చెందిన ఇతర పుస్త కాలు కూడా అందుబాటులో ఉంటాయి. దేశవిదేశాల్లో రామాయణం పై

# ఏపీలో నామినేటెడ్ పదవుల జాతర..

ఈ 20 కార్పొరేషన్లలో టీడీపీకి 16, జనసేనకు 3, బీజేపీకి 1కి ఇచ్చారు.. మొత్తం 99 మందితో జాబితాను ప్రకటించింది. ఈ జాబితాలో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు ప్రభుత్వం చోటు కల్పించింది.

**20 కార్పొరేషన్లకు ఛైర్మన్లు, సభ్యుల ప్రకటన**

ఆర్టీసీ ఛైర్మన్‌గా కొనకళ్ల నారాయణ, ఆర్టీసీ వైస్ ఛైర్మన్‌గా మునిరత్నంకి ఛాన్స్ ఇచ్చారు. ఏపీఐఐసీ ఛైర్మన్‌గా మంతెన రామరాజు, 20సూత్రాల అమలు కమిటీ ఛైర్మన్‌గా బీజేపీ నేత లంకా దినకర్, శాప్ ఛైర్మన్‌గా రవినాయుడు, వక్ఫ్ బోర్డ్ ఛైర్మన్‌గా అబ్దుల్ అజీజ్, హౌసింగ్ బోర్డ్ ఛైర్మన్‌గా బత్తుల తాత్య బాబు, ట్రైకార్ ఛైర్మన్‌గా శ్రీనివాసులు, మారిటైమ్ బోర్డ్ ఛైర్మన్‌గా దామచర్ల సత్య పేర్లు ప్రకటించారు. అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్‌ఫ్రా డెవలప్‌మెంట్ ఛైర్మన్‌గా పీలా గోవింద్, లెదర్ ఇండస్ట్రీస్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్‌గా పిల్లి మాణిక్యరావు, స్టేట్ కన్జ్యూమర్ ప్రొటెక్షన్స్ కౌన్సిల్ ఛైర్మన్‌గా పీతల సుజాత, %మీవీజు%డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్‌గా శివశంకర్ (జనసేన), సివిల్ సప్లైస్ కార్పొరేషన్ ఛైర్మన్‌గా సీతారామ సుధీర్ (జనసేన), ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ ఛైర్మన్‌గా వజ్జా బాబూరావు, ఏపీ టిడ్కో ఛైర్మన్‌గా అజయ్ కుమార్ (జనసేన), సీడ్ ఏపీ కార్పొరేషన్ ఛైర్మన్‌గా దీపక్ రెడ్డి, మార్క్‌ఫెడ్ ఛైర్మన్‌గా కర్రోతు బంగార్రాజు, సీడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్‌గా మన్నె సుబ్బారెడ్డి, పద్మశాలి వెల్ఫేర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్‌గా నందం అబదయ్య, టూరిజం డెవల్‌మెండ్ కార్పొరేషన్ ఛైర్మన్‌గా నూకసాని బాలాజీను ప్రకటించారు.

**సీట్లు త్యాగం చేసిన వారికి ఇప్పుడు పదవుల్లో ప్రాధాన్యత..**నెల్లూరు మాజీ మేయర్ అబ్దుల్ అజీజ్ ఇప్పుడు వక్ఫ్ బోర్డ్ ఛైర్మన్ అయ్యారు.. ఎలక్షన్ ముందు నెల్లూరు రూరల్ టీడీపీ టికెట్ ఆశించారు. కానీ కోటంరెడ్డి కారణంగా ఆ సీటు దక్కలేదు. అయినప్పటికీ పార్టీ కోసం పనిచేసిన అజీజ్‌కు వక్ఫ్ బోర్డు ఛైర్మన్ ఇచ్చారు.

ఇక.. డోన్‌లో ముందుగా టికెట్ మన్నె సుబ్బారెడ్డికి అనౌన్స్ చేశారు.. కానీ తర్వాత కోట్ల సూర్య ప్రకాష్‌రెడ్డికి టికెట్ మార్చారు. పార్టీ కోసం త్యాగం చేసి పనిచేసిందుకు ఇప్పుడు సుబ్బారెడ్డికి నామినేటెడ్ పదవి దక్కింది. ఆయన సీడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ అయ్యారు..

ఉండి నియోజకవర్గంలో మొన్నటి సిట్టింగ్ రామరాజు.. రఘురామకృష్ణంరాజు కోసం తన టికెట్ త్యాగం చేసినందుకు ఆయనకు కూడా నామినేటెడ్ పదవి దక్కింది.. రామరాజు ఇప్పుడు ఛైర్మన్ అయ్యారు..

ఇక.. కర్రోతు బంగార్రాజు నెల్లిమర్ల టీడీపీ టికెట్ ఆశించారు. కానీ పొత్తులో భాగంగా జనసేన నుంచి లోకం మధవి అక్కడ పోటీచేసింది. జనసేన కోసం సీటు త్యాగం చేసిందుకు కర్రోతు బంగార్రాజుకి కూడా ఇప్పుడు పదవి దక్కింది. ఆయన మార్క్‌ఫెడ్ ఛైర్మన్ అయ్యారు

ఇక.. మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద్ అనకాపల్లి టికెట్ వదులుకున్నందుకు ఆయన్నూ పార్టీ గుర్తించిందనే చెప్పాలి.. అనకాపల్లి టికెట్ జనసేన నేత కొణతాల రామకృష్ణకు వెళ్లడంతో పీలా గోవింద్‌కు కీలక పదవి ఇస్తామని అప్పుడే పార్టీ హామీ ఇచ్చింది. ఇప్పుడు అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్‌ఫ్రా డెవలప్‌మెంట్ ఛైర్మన్‌గా పీలా గోవింద్‌కు పదవి దక్కింది.

ఇక మచిలీపట్నం టికెట్ త్యాగం చేసినందుకు కొనకళ్ల నారాయణకు కూడా ప్రాధాన్యత ఇచ్చారు. ఆయన ఆర్టీసీ ఛైర్మన్ అయ్యారు

# మైనారిటీల సంక్షేమం కోసం బృహత్ ప్రణాళిక.

గతంలో టిడిపి ప్రభుత్వం అమలు చేసిన మైనారిటీ సంక్షేమ పథకాలను వైసిపి ప్రభుత్వం పూర్తిగా పక్కనపెట్టి మైనార్టీల అభివృద్ధిని అడ్డుకుందని విమర్శించారు. ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో భాగంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్ని ప్రభుత్వ శాఖల వారీగా సమీక్షలు చేపట్టి వైసీపీ ప్రభుత్వ తప్పిదాలను సరి చేసి , ప్రజా పాలనను తిరిగి గాడిలో పెట్టేందుకు శ్రమిస్తున్నారని అన్నారు. ఇందులో భాగంగానే ఈనెల 23వ తేదీన మైనార్టీ సంక్షేమం, శాఖల పై సీఎం సుధీర్గంగా సమీక్ష చేసి చేపట్టాల్సిన కార్యక్రమాలను అధికార యంత్రాంగానికి దిశా నిర్దేశం చేశారని అన్నారు.ముఖ్యంగా రాష్ట్రంలోని ముస్లిం మైనార్టీల సంక్షేమానికి విప్లవాత్మక దిశగా అభివృద్ధి కార్యాచరణకు సిద్ధం కావాలని సీఎం నిర్ణయించడం పట్ల ముస్లిం సమాజం తరఫున కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు మంత్రి ఫరూక్ పేర్కొన్నారు. ముస్లిం మైనారిటీ వర్గాలకు అందే పథకాలను రీస్ట్రక్చర్ చేయాలని అధికారులను ఆదేశించడం పట్ల మైనార్టీల్లో ఆనందం వ్యక్తం అవుతుందని అన్నారు. సీఎం ఆదేశాల మేరకు ప్రధాన మంత్రి జన్ వికాస్ కార్యక్రమం కింద మంజూరైన రూ.447 కోట్లు కు సంబంధించి పెండింగ్ లో ఉన్న పనులు పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టనున్నట్లు వెల్లడించారు. తెలుగు దేశం ప్రభుత్వంలో మంజూరై కొంత మేర నిర్మాణాలు జరిగిన షాదీకానాలు, ఇతర నిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేస్తామని, కడపలో తెలుగు దేశం ప్రభుత్వం రూ. 24 కోట్లు మంజూరు చేసి అందులో రూ.15 కోట్లు ఖర్చు చేసిందని,గుంటూరు క్రిస్టియన్ భవన్ కు నాడు తెలుగు దేశం ప్రభుత్వం రూ.16కోట్లు మంజూరు చేయగా 50 శాతం పనులు పూర్తి అయ్యాయని మిగిలిన పనులను వీలైనంత త్వరగా పూర్తి చేసేందుకు చర్యలు చేపడుతున్నట్టు తెలిపారు. వక్ఫ్ బోర్డు భూముల సర్వే రెండేళ్లలో పూర్తి చేయాలని సీఎం ఆదేశించారని, దూదేకుల నూర్ భాషా కార్పొరేషన్ ఏర్పాటు,ఇమామ్ లకు, మౌజన్ లకు నెలకు గౌరవ వేతంన కింద రూ.10 వేలు, రూ.5 వేలు ఇస్తామన్న హామీని త్వరల్లో అమలు చేసేందుకు కార్యాచరణకు శ్రీకారం చుట్టినట్టు తెలిపారు. మసీదుల నిర్వహణకు రూ. 5 వేలు ఆర్థిక సాయం, విజయవాడ గన్నవరం ఎయిర్పోర్ట్ నుంచి హజ్ యాత్రకు వెళ్లే హజ్ యాత్రికులకు రూ. 1 లక్ష సాయం, రూ 105 కోట్లతో నంద్యాల,గుంటూరు, అనంతపురం జిల్లా కేంద్రాలలో మైనారిటీ యువత ఎంపవర్మెంట్ కోసం మూడు సెంటర్స్ ఫర్ ఎక్సలెన్సీ నైపుణ్య అభివృద్ధి కేంద్రాలు ఏర్పాటుతో మైనార్టీల సంక్షేమం విప్లవంలా ముందుకు సాగబోతున్నదని అన్నారు.కర్నూల్లో హైకోర్టు ఏర్పాటుకు ప్రతిపాదనలు, అమరావతిలో 100 ఎకరాల్లో అంతర్జాతీయ ప్రమాణాలతో న్యాయ కళాశాల, జూనియర్ న్యాయవాదులకు రూ 10,000 గౌరవ వేతనం, నిందితులకు శిక్షపడేలా ప్రాసిక్యూషన్ పటిష్టత, జూనియర్ న్యాయవాదులకు శిక్షణ కేంద్రం కోసం అకాడమీ ఏర్పాటు అంశంపై సీఎం చంద్రబాబు దిశా నిర్దేశం చేశారని, న్యాయశాఖలో చేపట్టబోయే కార్యక్రమాలకు సీఎం ఆదేశాలతో ముందుకు సాగుతామని అన్నారు. మైనార్టీ సంక్షేమ న్యాయశాఖలో అమలు చేయబోయే విప్లమాత్మకమైన చర్యలు ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించడం పట్ల మరోసారి కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు మంత్రి ఫరూక్ తెలిపారు.


## ఏపీలో మొట్టమొదటి వాల్మీకి రీసెర్చ్ సెంటర్..

అధ్య య నం చేసే ఆసక్తి ఉన్నవారెవరైనా ఇక్కడ రీసెర్చ్ చేయవచ్చు. రామా యణంలోని నైతిక విలువలతో కూడిన పలురకాల శ్రీరాముని రూపాలుఇక్కడ రీసెర్చ్ చేసే విద్యార్థులకు ఉపయోగకరంగా ఉన్నాయి.

రామాయణంపై అనేక మంది అనేక రకాల రామాయణాలు రచించినప్పటికీ వాల్మీకి రామాయణం ప్రధానమైనది. కాగా ఇప్పటివరకు వాల్మీకి రామాయణం పై అధ్యయనం చేసేందుకు ఎక్కడ కూడా రిసెర్చ్ సెంటర్ లేదు. అయితే ఇప్పుడు విజయనగరం రామనారాయణం లో వాల్మీకి రిసెర్చ్ సెంటర్ ప్రారంభం కానుండటంతో రామభక్తులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఇక్కడ అధ్యయనం చేసే విద్యార్థులకు రామనారాయణంలోనే ప్రత్యేకమైన సౌకర్యాలు కూడా ఏర్పాటు చేశారు నిర్వాహకులు. ధనస్సు ఆకారంలో నిర్మితమైన రామనారాయణంను ఉత్తరాంధ్ర అయోధ్యగా పిలుస్తారు. రామనారాయణంలో భావితరాలకు నైతిక విలువలు అందించేలా రామాయణంలోని పలు ఘట్టాలను రూపొందించి అందుబాటులో ఉంచారు. రామనారాయణంలోని అపురూప ఘట్టాలను, లేజర్ షో ను నిత్యం వేలాది మంది భక్తులు తరలివచ్చి తిలకిస్తుంటారు. రామనారాయణంలో ఇప్పటికే టిటిడి ఆధ్వర్యంలో నడుస్తున్న వేద పాఠశాల కూడా ఉంది. ఇప్పుడు రిసెర్చ్ సెంటర్ తో రామనారాయణ ప్రాముఖ్యత మరింత పెరగనుంది.

ఈ వాల్మీకి రీసెర్చ్ సెంటర్ ప్రారంభం సందర్భంగా ఈ నెల 27, 28, 29వ తేదీల్లో రామాయణం పై నాలుగు భాషల్లో మహా సదస్సు కూడా ప్రపంచంలోనే మొట్టమొదటిసారి జరగనుంది. ఈ మహా సదస్సుకు దేశ విదేశాల్లోనే ప్రముఖ పండితులు, పీఠాధిపతులు తరలివచ్చి శ్రీరామునికి సంబంధించి పలు అంశాలపై చర్చిస్తారు. భారీగా జరగనున్న ఈ కార్యక్రమానికి వైదిక్ యూనివర్శిటీ వైస్ ఛాన్సలర్ తో పాటు పలువురు రాష్ట్ర మంత్రులు, ప్రముఖులు తరలిరానున్నారు. శ్రీరాముని జీవిత చరిత్రను థీమ్ పార్క్ రూపంలో రూపొందించి భావితరాలకు నైతిక విలువలను అందించాలని దృక్పథంతో నారాయణం నరసింహామూర్తి ఈ రామనారాయణంను ప్రారంభించారు.

ప్రస్తుతం వాల్మీకి రిసెర్చ్ సెంటర్ రామనారాయణంలో ప్రారంభించడం తమ అదృష్టమని, భవిష్యత్తులో మరిన్ని శ్రీరామునికి సంబంధించిన విషయాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు శ్రీకారం చుడతామని రామనారాయణం సిఇవో నారాయణం నీరజాశ్రీనివాస్ పేర్కొన్నారు.





## పరిహారం కోసం ఎదురుచూపులు

మంచిర్యాల, సెప్టెంబర్ 24, రిపబ్లిక్ న్యూస్. ప్రకృతి వైపరీత్యం కార ణంగా అన్నదాతకు నష్టం వాటిల్లగా ప్రభుత్వపరంగా సాయం అందించ డంలో జాప్యం జరుగుతోంది. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు జిల్లాలో పంట నీటి పాలుకావడంతో రైతులు ఆందోళనకు గురవుతున్నారు. వేలకు వేలు అప్పు చేసి పెట్టుబడులు పెట్టి సాగు చేసిన పంట మొలక దశలోనే నీట మునగడంతో కనీసం పెట్టుబడులు కూడా రాని పరిస్థితులు నెలకొన్నాయి. ముఖ్యంగా ఏపుగా పెరిగిన పత్తి పంటకు భారీ స్థాయిలో నష్టం వాటిల్లింది.

**జిల్లాలో నీట మునిగిన పంట**

భారీ వర్షాల కారణంగా జిల్లాలోని పలు మండలాల్లో ప్రధానంగా 393 మందికి రైతులకు చెందిన పత్తి, వరి పంటలు 543 ఎకరాల్లో నీట ముని గినట్లు వ్యవసాయశాఖ అధికారులు అంచనాకు వచ్చారు. జన్నారం మండలం తొమ్మిది గ్రామాల్లోని 167 మంది రైతులకు చెందిన మొత్తం 171 ఎకరాల్లో పంటలకు నష్టం వాటిల్లింది. చెన్నూరు మండలంలోని ఆరు గ్రామాల్లో 60 మందికి చెందిన 127 ఎకరాల పంట పూర్తిగా నీటిపాలైంది. జైపూర్ మండలంలోని నాలుగు గ్రామాల్లో 40 మంది రైతులకు చెందిన వందల ఎకరాల్లో పంట ధ్వంసమైంది. హాజీపూర్ మండలంలో రెండు గ్రామాల్లోని 39 మంది రైతులకు చెందిన 89 ఎకరాల పంట నీటిపాలు అయింది. నస్పూర్ మండలంలోని ఒక గ్రామంలో 19 మంది రైతులకు చెందిన 41 ఎకరాల్లో నష్టం వాటిల్లింది. మంచిర్యాల మండలానికి సంబంధించి రెండు గ్రామాల్లో 39 మంది రైతులకు చెందిన 89 ఎకరాల పంట నీట మునిగింది.

**పంట నష్టం వివరాలు ఇలా**

వ్యవసాయ అధికారులు పంట నష్టం అంచనా వేసి, ప్రభుత్వానికి నివేదిక అందజేశారు. జన్నారం మండలంలో 129 ఎకరాల్లో వరి పంటకు నష్టం వాటిల్లగా, 43 ఎకరాల్లో పత్తి పంట, ఏడు ఎకరాల్లో కందికి నష్టం వాటిల్లింది. హాజీపూర్ మండలంలో 43 ఎకరాల్లో పత్తి, 28 ఎకరాల్లో వరి పంటకు నష్టం వాటిల్లింది. మంచిర్యాల మండలంలో 80 ఎకరాల్లో పత్తి, మూడు ఎకరాల్లో వరి నీటి పాలైంది. నస్పూర్ మండలంలో తొమ్మిది ఎకరాల్లో పత్తి, 23 ఎకరాల్లో వరి నీట మునిగింది. జైపూర్ మండలంలో వంద ఎకరాల్లో పత్తి, చెన్నూరు మండలంలో 90 ఎకరాల్లో పత్తి పంట నీట మునిగింది.

**పెట్టుబడి నీటి పాలు**

జిల్లాలోని పత్తి, వరి, ఇతర పంటలు సాగు చేసిన రైతన్నలకు తీరని నష్టం వాటిల్లింది. పంట సాగు సమయంలో ఎకరాకు రూ.40 వేలు వెచ్చించినట్లు రైతులు తెలిపారు. భూములు దున్నడం మొదలుకొని విత్తనాలు వేయడం ఎరువులు, కలుపు తీయడం, కూలీలకు వెచ్చించారు. సకాలంలో వర్షాలు కురవడంతో ముఖ్యంగా పత్తి పంటపై రైతులు గంపెడాశలు పెట్టుకున్నారు. అయితే అతివృష్టి కారణంగా వారి ఆశలన్నీ అడియాసలయ్యాయి. పంట మొత్తం తుడిచి పెట్టుకుపోవడంతో రెక్కల కష్టం కూడా మిగలక పోగా, సాగు కోసం చేసిన అప్పు ఎలా తీర్చాలో తెలియక తీవ్ర మనస్తాపానికి గురవుతున్నారు.

**నెల రోజులు కావస్తున్నా అందని పరిహారం....**

భారీ వర్షాల కారణంగా వివిధ రకాల పంటల నష్టాన్ని అంచనా వేసిన అధికారులు రెండు వారాల క్రితం తుది నివేదికను ప్రభుత్వానికి అందజే శారు. క్షేత్రస్థాయిలో పంట చేలను సందర్శించి నష్టం వివరాలను సేకరించారు. జిల్లా వ్యాప్తంగా గోదావరి పరివాహక ప్రాంతాలైన మంచి ర్యాల, చెన్నూరు నియోజకవర్గాల్లో నష్టం అపారంగా ఉంది. అయితే నెల రోజులు గడుస్తున్నా పరిహారం అందకపోవడంతో రైతులు ఆందోళనకు గురవుతున్నారు.

**ప్రభుత్వంపైనే ఆశలు...**

వర్షాలతో ఊహించని విధంగా నష్టం వాటిల్లడంతో ప్రభుత్వంపైనే భారం వేస్తున్నారు. ఖమ్మం జిల్లాలో పర్యటించిన ముఖ్యమంత్రి రైతులు నష్టపోయిన పంటలకు ఎకరాకు రూ.10వేలు పరిహారం చెల్లిస్తామని ప్రకటించారు. ప్రభుత్వం ప్రకటించిన మేరకు నష్టపరిహారం చేతికి అం దినా కనీసం పెట్టుబడులు తిరిగొస్తాయన్న ఆశతో ఉన్నారు. ఇన్ని రోజు లూ నష్టం అంచనా నివేదిక తయారీలో జాప్యం జరుగగా, ప్రస్తుతం పరి హారం అందించడంలోనూ ప్రభుత్వం తాత్సారం చేస్తుండటంతో అన్నదాత లు దిగులు చెందుతున్నారు. త్వరగా పరిహారం అందించి ఆదుకోవాలని బాధిత రైతుల కోరుతున్నారు.

**ప్రభుత్వానికి నివేదిక అందజేశాం**

**వ్యవసాయశాఖ జిల్లా అధికారి సురేఖ**

భారీ వర్షాల కారణంగా జిల్లాలో జరిగిన పంట నష్టం అంచనా తుది రిపోర్టును కలెక్టర్ ద్వారా ప్రభుత్వానికి అందజేశాం. ప్రభుత్వ నిర్ణయం మేరకు పంట నష్టం పరిహారం అందే అవకాశాలు ఉన్నాయి.

## భైరెడ్డి సమక్షంలో వైసీపీ ని వీడి టీడీపీ భారీ చేరికలు .

**టీడీపీ పాలనలోనే గ్రామాల అభివృద్ధి - మాజీ ఎమ్మెల్యే భైరెడ్డి రాజశేఖర్ రెడ్డి**



నంద్యాల ప్రతినిధి, సెప్టెంబర్ 24, రిపబ్లిక్ న్యూస్. :: ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని ఉమ్మడి ప్రభుత్వంతోనే గ్రామాలు అభివృద్ధి చెందుతాయని, ఇది పేదల ప్రభుత్వం అని మాజీ ఎమ్మెల్యే భైరెడ్డి రాజశేఖర్ రెడ్డి అన్నారు.

మంగళవారం నంద్యాల ఎంపీ డాక్టర్ భైరెడ్డి శబరి కార్యాలయంలో పాణ్యం మండలంలోని మద్దూరు, గోనవరం, నేరవాడ, భూపనపాడు గ్రామాల ఎం పి టి సి లు, గ్రామ సర్పంచ్ లు వైసీపీ ని వీడి భైరెడ్డి సమక్షంలో టీడీపీలో చేరారు.

ఈ సందర్భంగా భైరెడ్డి మాట్లాడుతూ పార్టీలకు అతీతంగా నంద్యాల ఎంపీ డాక్టర్ భైరెడ్డి శబరి కేంద్రం నిధులతో గ్రామాలు అభివృద్ధి చేసుకుందాం అన్నారు. వైసీపీ ని వీడి టీడీపీ లో చేరిన వారికీ సముచిత స్థానం ఉంటుందని భైరెడ్డి భరోసా ఇచ్చారు.

కె డి సి సి మాజీ డైరెక్టర్ వీరేంద్ర సింహారెడ్డి ఆధ్వర్యంలో పాణ్యం మండలం మద్దూరు గ్రామ సర్పంచ్ గోపవరం ప్రదీప్ రెడ్డి, జి. భరత్ కుమార్ రెడ్డి, సుధాకర్ రెడ్డి, మధు, సాకలి శివ, నాగరాజు, నూర్ బాషా, అల్లాభకాష్, రాము, అక్బర్ బాషా తదితరులు.

గోనవరం గ్రామ సర్పంచ్ రాజమ్మ, శేఖర్, తదితరులు,

భూపనపాడు ఎంపిటిసి సుధారాణి, మనోహర్, తదితరులు

నెరవాడ గ్రామ సర్పంచ్ లింగాల శారదమ్మ, శివారెడ్డి, ఎం. శేషారెడ్డి, రేస్మా, సుబ్బారాయుడు, ఫిరా ఊసేన్, రఫీ, పుష్పరాజ్, శేసిరెడ్డి, జ్యోతి స్వరూప రెడ్డి తదితరులు వైసీపీ ని వీడి భైరెడ్డి రాజశేఖర్ రెడ్డి సమక్షంలో టీడీపీ లో చేరారు. వీరికి టీడీపీ కండువాలు వేసి భైరెడ్డి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమం మద్దూరు గణపం పుల్లారెడ్డి, పాణ్యం పుల్లారెడ్డి, గోరుకల్లు ఎరుకలయ్య, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డా. కాకరవాడ చిన్న వెంకటస్వామి, నంద్యాల టీడీపీ నాయకులు నరహరి విశ్వనాథ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## దుర్గ గుడి మెట్లు శుభ్రం చేసిన పవన్ కల్యాణ్!

అనంతరం దుర్గమ్మను పవన్ దర్శించుకున్నారు. ఎంపీలు కేశినేని శివనాథ్, బాలశౌరి, ఎమ్మెల్సీ హరిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. ప్రాయశ్చిత దీక్ష విరమించేందుకు పవన్ అక్టోబర్ 1న తిరుపతి నుంచి అలిపిరి మెట్ల మార్గంలో తిరుమలకు నడుచుకుంటూ వెళ్లనున్నారు. 2న ఉదయం శ్రీవారిని దర్శించుకున్న తరువాత ఆయన దీక్ష విరమించనున్నారు.

వైసీపీ పాలనలో ఆలయాల్లో తప్పు జరిగిందని చెబితే అపహాస్యం చేసేవారని పవన్ అన్నారు.అపవిత్రం జరిగినప్పుడు బాధ్యత ఉన్న వ్యక్తులు సమాధానం చెప్పాలని అన్నారు. వైసీపీ నేతల తీరు పై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు.

నా పై విమర్శలు కాదు..అపవిత్రం జరిగిందని తెలిసినప్పుడు మీ బాధ్యతేంటని ఆయన ప్రశ్నించారు. లడ్డూ ప్రసాదంలో అపవిత్రం జరిగిందంటే చాలా ఆవేదన కలుగుతోంది. ఇప్పటికీ వైసీపీ నేతలు బాధ్యత లేకుండా మాట్లాడుతున్నారు. సున్నిత అంశాల పై ఆ పార్టీ నేత పొన్నవోలు సుధాకర్ రెడ్డి వ్యాఖ్యలు బాధాకరం. సనాతన ధర్మం జోలికి రావొద్దు. తప్పు జరిగితే ఒప్పుకోవాలి...లేకపోతే సంబంధం లేదని చెప్పండి. అంతేకానీ ఇలాంటి వ్యాఖ్యలు చేయోద్దని పవన్ అన్నారు.

## మూసీ రివర్ ఫ్రంట్ ప్రాజెక్ట్ బాధితులకు ఊరట..



ముందుగా మూసీ రివర్ బెడ్‌లో ఆక్రమణలో ఉన్న 1600 ఇళ్లను తొలగించి.. అక్కడ ఉన్న బాధితులను డబుల్ బెడ్ రూం ఉన్న ప్రాంతాలకు తరలించనున్నారు. మూసీ బఫర్ జోన్‌లో నివసించే వ్యక్తులు, నిర్మాణాలకు చట్టం ప్రకారం రేవంత్ ప్రభుత్వం పరిహారం అందజేయనుంది. నిర్మాణ ఖర్చుతో పాటు, వారికి పట్టా ఉంటే భూమి విలువను పరిహారంగా చెల్లించనుంది. వారికి డబుల్ బెడ్ రూం ఇళ్లను కేటాయించనుంది.

చెరువులు, నాలాల ఆక్రమణల తొలగింపుపై హైడ్రాకు సీఎం రేవంత్ కీలక ఆదేశాలు

మూసీ బాధిత ప్రజలందరికీ చట్టప్రకారం పునరావాసం కల్పిస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇప్పటికే భరోసా కల్పించారు. ఇటీవల మంత్రి పొన్నం ప్రభాకర్ అధికారులతో కలిసి మూసీ పరివాహక ప్రాంతంలో పర్యటించి అండగా ఉంటామని హామీ ఇచ్చారు. నిర్వాసితులను సంప్రదించి పునరావాసం కల్పించే ప్రక్రియను రేపు(బుధవారం) కలెక్టర్లు ప్రారంభించనున్నారు.

మరోవైపు.. మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్, హైదరాబాద్ మెట్రో రైలుపై సంబంధిత అధికారులతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇవాళ( మంగళవారం) సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి %పీూడఖణ% ప్రిన్సిపల్ సెక్రటరీ దానకిశోర్, మెట్రో రైల్ ఎండీ ఎన్వీఎస్ రెడ్డి, సలహాదారు శ్రీనివాసరాజు, సీఎం స్పెషల్ సెక్రటరీ అజిత్ రెడ్డి, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి, సర్ఫరాజ్ అహ్మద్, రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాల కలెక్టర్లు, ఇతర ఉన్నతాధికారులు, హైడ్రా కమిషనర్ రంగనాథ్ హాజరయ్యారు. ఈ సమావేశంలో సీఎం రేవంత్ కీలక నిర్ణయాలు తీసుకున్నారు.

## ఏబీఎం పాలెం అభివృద్ధి కి కృషి చేయండి

### టీడీపీ సీనియర్ నాయకులు నిమ్మకాయల మోహన్, కళాకార్




నందికొట్కూరు, 24, (రిపబ్లిక్ న్యూస్) : మున్సిపల్ కమిషనర్ ను ఎస్ బేబీ మేడం ని ఎబిఎం పాలెం టిడిపి నాయకులు మంగళవారం మర్యాద పూర్వకంగా కలిశారు. కమిషనర్ కు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. పట్టణ అభివృద్ధి కి కృషి చేయాలని కోరారు. అభివృద్ధిలో భాగంగా ఏబీఎం పాలెంలో కూడా నిధులు కేటాయించి అభివృద్ధి చేయాలని కోరారు. కార్యక్రమంలో కౌన్సిలర్ భాస్కర్ రెడ్డి, నిమ్మకాయల మోహన్, 22వ వార్డు ఇన్చార్జి కళాఖర్,రాజు, రాజ్ కుమార్,( సన్నీ), ప్రమోద్, బొగ్గుల శేఖర్,అడివప్ప, ఏబీఎం పాలెం టీడీపీ నాయకులు ప్రేమ్, కళ్యాణ్ వంశీ, ఉన్నారు

## రాష్ట్ర స్థాయికి ఎంపికైన ఆళ్లగడ్డ క్రీడాకారులు..




ఆళ్లగడ్డ ప్రజా రిపబ్లిక్ న్యూస్: ఆళ్లగడ్డ పట్టణంలోని పాలసాగరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన క్రీడాకారులు జిల్లాస్థాయిలో స్కూల్ గేమ్స్ పోటీలలో విజయం సాధించి రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు పాఠశాల హెచ్ఎం మురళీధర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 21న కర్నూలు లోని జిల్లా స్పోర్ట్స్ అథారిటీ స్టేడియం నందు జరిగిన అండర్ 17 బాయ్స్ సెపక్ తక్రా విభాగంలో పాఠశాలకు చెందిన పదవ తరగతి విద్యార్థి వేమ నారాయణరెడ్డి అదేవిధంగా 23 న నంద్యాల లోని కే.ఎన్.ఎమ్ మున్సిపల్ హై స్కూల్ మైదానంలో జరిగిన జిల్లాస్థాయి బాల్ బ్యాట్మెంటన్ పోటీల్లో పాఠశాల విద్యార్థులు యుగంధర్ (పదవ తరగతి) ధర్మ దస్తగిరి (పదవ త రగతి) బి. వెంకట సంతోష్ కుమార్ రెడ్డి( ఏడో తరగతి) అండర్ 17 బాయ్స్ రోప్ స్కిప్పింగ్ విభాగంలో కే. వేమ నారాయణ రెడ్డి జిల్లాస్థాయి లో మంచి ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక కావడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా విజేతలైన క్రీడాకారులను, వారి విజయానికి కృషి చేసిన పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు బి.బాబును పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బి.మురళీధర్ అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయ బృందం విద్యార్థులు పాల్గొన్నారు.

## పంట సాగులో యాజమాన్య పద్ధతులపై రైతులకు అవగాహన




రుద్రవరం,ప్రజా రిపబ్లిక్ న్యూస్ పంట సాగులో రైతులకు యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పించినట్లు వ్యవసాయ అధికారి శ్రీకృష్ణ తెలిపారు. మండలంలోని కోటకొండ, యల్లావత్తల గ్రామాలలో మంగళవారం పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా మండల వ్యవసాయ అధికారి గారు మాట్లాడుతూ వారంలో రెండు రోజులు గ్రామాల్లో పర్యటించి ప్రస్తుతం రైతులు సాగు చేస్తున్న పంటలసాగులో సమగ్ర యాజమాన్య పద్ధతుల గురించి వివరించి సాగులో మెలకువలు రైతులకు సూచనలు సలహాలు ఇవ్వడం జరిగిందన్నారు. వాతావరణ ప్రతికూల ప్రభావం వలన వరిలో బ్యాక్టీరియా ఆకుమచ్చ తెగులు, అగ్గి తెగులు వస్తున్నాయని వాటి నివారణ కొరకు సుడోమోనాస్ 5 గ్రాములు లీటర్ నీటికి కలిపి పిచికారి చేసుకోవాలని తెలిపారు ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి రాజు, రైతు సేవ కేంద్రం సిబ్బంది రేవతి, వెటర్నరీ అసిస్టెంట్ బాలు నాయక్ గ్రామ పెద్దలు జంగిటి రాజు యల్లావత్తుల గ్రామ సర్పంచ్ చంద్రమోహన్ రైతులు పాల్గొన్నారు.

## ఎస్ కొత్తూరులో సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు

పాణ్యం సెప్టెంబర్ 24 (రిపబ్లిక్ న్యూస్): మహిమాన్వితుడు, సంతాన వరుదుడు, భక్తులకు వరాలిచ్చే మహాదేవుడు, సుబ్రహ్మణ్యేశ్వర స్వామి దేవస్థానంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో ప్రతి మంగళవారము మధ్యాహ్నం 3 గంటల నుండి 4- 30 గంటల వరకు రాహుకాల దోష పూజలు



నిర్వహిస్తారు. అంతకుముందు దోషమున్న వారు స్వామివారికి 101 ప్రదక్షిణలు చేసి మధ్యాహ్నం రాహుకాల పూజల తో దోష నివారణ కోసం అర్చకులు చేత పూజలు నిర్వహిస్తారు. స్త్రీ పురుషులు ,మహిళలు, యువకులు, ఆయా కుటుంబీకులకు ఉన్న సమస్యలతో స్వామివారికి రాహుకాల దోష పూజల్లో పాల్గొన్న వారందరికీ కూడా స్పష్టమైన ప్రయోజనాలు కలుగుతున్నాయని ఇక్కడ భక్తులకు నమ్మకం. సుబ్రహ్మణ్యేశ్వర స్వామి దేవస్థానంలో రాహువు కేతువు విగ్రహాలకు ఎదురుగా దోషపూరిత భక్తులు మంగళ స్నానాలు ఆచరించి ఎటువంటి ఆహార పదార్థాలు తీసుకోకుండా స్వామివారికి ఉపవాస పూజలు నిర్వహించిన అనంతరం దేవస్థానం నిత్య అన్నదాన సత్రంలో కడుపార ఆహారము తీసుకొని భక్తులు సంతృప్తి చెందుతారు. ప్రతి మంగళవారం స్వామివారి దర్శనం కోసం వచ్చే భక్తులకు సోమవారం రాత్రి కూడా అన్న సత్రంలో అల్పాహారం ఏర్పాటు చేసి భక్తులకు సౌకర్యం ఏర్పాటు చేస్తారు. స్వామి దర్శనం కోసం వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా దేవస్థానం సిబ్బంది, ఆలయ అర్చకులు, వీరయ్య స్వామి, నారాయణస్వామి ,సురేష్ శర్మ, రోహిత్ శర్మ, కిట్టయ్య స్వామి ,తదితరులు భక్తుల సేవలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా పర్యవేక్షణ చేశారు.

# స్వచ్ఛ యాక్షన్ ప్లాన్ నేషనల్ టైగర్ కన్సర్వేషన్ అథారిటీ







సూచనల మేరకు ఈ దినము (24బి 9బి 2024)వ తేదీ శ్రీయుత గౌరవ డిప్యూటీ డైరెక్టర్ ప్రాజెక్ట్ టైగర్ శ్రీయుత అనురాగ్ మీనా, వారి ఆదేశాల మేరకు మరియు శ్రీయుత బి. శ్రీపతి నాయుడు ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్, రుద్రవరం వారి సూచనల మేరకు మేము (యాంటీ పోచింగ్ క్యాంపు) యందు రేంజ్ స్టాఫ్ మరియు ప్రొటెక్షన్ వాచర్స్ యాంటీ పో చింగ్ క్యాంప్ ప్రొటెక్షన్ వాచర్లు అందరూ కూడా పాల్గొనడం అయినది. ఇందులో భాగంగా గాంధీ జయంతికి 15 రోజులు ముందుగా వారి ఆశయాలను నెరవేర్చాలనే ఉద్దేశముతో స్వచ్ఛత మరియు పరిసరాల పరిశుభ్రత వంటి కార్యక్రమాలను నిర్వహించడమైనది. మానవ మనుగడ కొనసాగించాలంటే స్వచ్ఛమైన గాలిని పీల్చు కోవడం కోసం ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా కనీసము ఒక మొక్కను నాటి సంరక్షించాలని పర్యావరణాన్ని పరిరక్షించాలని స్వచ్ఛహిత సేవా కార్యక్రమాల్లో భాగంగా పిలుపునివ్వడమైనది. "స్వచ్ఛత హి సేవ" కార్యక్రమం సందర్భంగా మేము అహోబిలం నుండి ఆళ్లగడ్డకు వెళ్ళు ర స్తా వెంబడి అటవీప్రాంతం సాయిబాబా గుడి నుండి దుర్గమ్మ బ్రిడ్జి (టీజీపీ కెనాల్) వరకు రోడ్డు వెంబడి ఉన్న ప్లాస్టిక్ ను తీసివేయడమైనది. ఈ కార్యక్రమంలో రుద్రవరం సెక్షన్ సిబ్బంది మరియు నూతల సెక్షన్ సిబ్బంది ,శ్రీ ఎన్. శ్రీనివాసుల రెడ్డి ఎఫ్ ఎస్ ఓ , శ్రీమతి %=.జు%.రానెమ్మ ఎఫ్ఎస్ఓ ,బీట్ ఆఫీసర్స్ : శ్రీ .రామకృష్ణ ,శ్రీ వై నాగేంద్రయ్య శ్రీ సురేంద్ర గౌడ్, శ్రీ ఓ. నరసింహారెడ్డి మరియు %ఖీుశ్రీ.షిఖీఅ% బేస్ క్యాంప్ ప్రొటెక్షన్ వాచర్లు , అహోబిలం స్వచ్ఛ సేవకులు అందరూ కలసి పాల్గొనడం అయినది.

# రసాయన ఎరువులు వాడటం విషతుల్యం

## షణ్ముఖఆగ్రోటెక్ డెవలప్మెంట్ ఆఫీసర్ పెద్ద వీరన్న





ఆళ్లగడ్డ గోనెగండ్ల ప్రజా రిపబ్లిక్ న్యూస్: రసాయనఎరువులు వాడటం వల్ల భూమి ,తద్వారాపంటలు విషతుల్య మవుతాయని షణ్ముఖ ఆగ్రోటెక్ లిమిటెడ్ డెవలప్మెంట్ అధికారి పెద్ద వీరన్న అన్నారు.

సేంద్రియ ఎరువులను వాడటం వల్ల అధిక దిగుబడులు సాధించవచ్చని రైతులకు తెలిపారు. సోమవారం గోనెగండ్ల మండలం గంజిహల్లి గ్రామంలో షణ్ముఖ అగ్రిటెక్ సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రైతు అవగాహన సదస్సులో వారు మాట్లాడారు. ఈ సందర్భంగా రైతులతో వారు మాట్లాడుతూ

పంట సాగులో రసాయనిక ఎరువులు ఆధికంగా వాడడం వల్ల ఆహార ఉత్పత్తులు విషతుల్యం అవుతాయన్నారు. రసాయన ఎరువులు వాడకం వల్ల క్రమక్రమంగా భూమిలో భూసారం తగ్గిపోయి, పంట దిగుబడులు తగ్గిపోతాయి. మానవ జంతువాళికి ముప్పును కల్పిస్తాయి. సేంద్రియ ఎరువులు, జీవన ఎరువులు వాడడం వల్ల పెట్టుబడులను తగ్గించుకోవచ్చు అన్నారు. అలాగే అధిక దిగుబడులను సాధించ వచ్చు అన్నారు . షణ్ముఖ అగ్రోటెక్ రైతులకు అందించే సేంద్రియ జీవన ఎరువులైనా వామ్ గోల్డ్ డి, ఏ స్టర్ ,కంట్రోల్ ,ప్లస్ కవాచం , మరియు సుష్మ పోషకాలైన తారాజుంక్ శక్తిబోరాన్,భాగ్య, భాగ్య మ్యాక్స్, సేంద్రియ ఎరువులైన జీవన మిత్ర కీర్తి అంతేకాకుండా జీవ సస్య రక్షకాలైన జీత్ మరియు ఏకలవ్య వాడి అధిక దిగుబడులు సాధించవచ్చని రైతులకు తెలిపారు. మొక్కలకు కావాలసిన పోషకాలను అందించి మొక్కలలో వ్యాధి నిరోధక శక్తిని పెంచుతాయని రైతులకు తెలిపారు. షణ్ముఖ అగ్రోటెక్ లిమిటెడ్ గత 14 సంవత్సరాలుగా రైతులకు నాణ్యమైన ఉత్పత్తుల అందిస్తూ అధిక దిగుబడులు సాధించేలా కృషి చేస్తున్నారని తెలిపారు. పలు గ్రామాల్లో సేంద్రియ జీవన ఎరువులపై "రైతు అవగాహన సదస్సు " కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో కంపెనీ ప్రతినిధులు , ఏ ఎస్ ఎమ్ యునెస్ ఖాన్ ,ఫీల్డ్ ఆఫీసర్ మల్లికార్జున, ఆర్ఎం శేఖర్ బాబు ,ఏజీఎం రామకృష్ణ,గ్రామ పెద్దలు మరియు రైతులున్నారు

# రాయలసీమ సాగునీటి రంగాన్ని సత్వరమే గాడిలో పెట్టండి.



నంద్యాల రూరల్, సెప్టెంబర్ 24, రిపబ్లిక్ న్యూస్ : రాయలసీమ సాగునీటి రంగం శిథిలావస్థకు చేరింది. ఈ పరిస్థితిని అత్యంత ప్రాధాన్యతతో చక్కదిద్దాల్సిన అవసరం ఎంతైనా ఉందని రాయలసీమ సాగునీటి సాధన సమితి అధ్యక్షులు బొజ్జా దశరథరామిరెడ్డి స్పష్టం చేశారు. మంగళవారం నంద్యాల సమితి కార్యాలయంలో రాయలసీమ సాగునీటి ప్రాజెక్టులకు సంబంధించి ఒక ప్రకటనను విడుదల చేసారు.

ఈ సందర్భంగా దశరథరామిరెడ్డి మాట్లాడుతూ శ్రీశైలం రిజర్వాయర్ నిండుకుండలా ఉన్నా, రాయలసీమ ప్రాజెక్టులకు నీరందడం లేదనే విషయాన్ని పౌర సమాజానికి తెలియజేస్తూ, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల బాధ్యతను గుర్తు చేస్తూ రాయలసీమ సాగునీటి సాధన సమితి సెప్టెంబర్ 12న నంద్యాలలో సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ నేపథ్యంలో రాయలసీమ ప్రాజెక్టులను స్థితిగతులు స్వయంగా తెలుసుకొనే నేపథ్యంలో, ముందుగా హంద్రీనీవా ప్రాజెక్టు స్థితిగతులు తెలుసుకోవడానికి జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు రాయలసీమ జిల్లాల పర్యటనకు విచ్చేసినందుకు వారికి అభినందనలు తెలియజేస్తున్నామని తెలిపారు. 2014 – 19 లో టి డి పి ఆధ్వర్యంలోని రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్ర సాగునీటి బడ్జెట్ లో రాయలసీమకు సాగునీటి రంగానికి 17 శాతం నిధులు ఖర్చు చేసిందని జలవనురుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు హంద్రీ నీవా ప్రాజెక్టు సందర్భంగా 22.9.2024 న ప్రకటించారు. 2019 – 24 లో వైసిపి ప్రభుత్వం కేవలం 6 శాతం నిధులను మాత్రమే రాయలసీమ ప్రాజెక్టులకు ఖర్చు చేసారని ప్రకటించారు. వైసిపి ఆధ్వర్యంలోని ప్రభుత్వం కంటే టిడిపీ ఆధ్వర్యంలోని ప్రభుత్వం నిధులు అధికంగా కేటాయించినప్పటికీ రాయలసీమ సాగునీటి రంగంలో పురోగతి ఆశించిన స్థాయిలో లేదు. అందుకు నాలుగు దశాబ్దాలుగా ప్రారంభమైన హంద్రీనీవా ప్రాజెక్టులో భాగమైన పందికోన రిజర్వాయర్ దుస్తితిని సవివరంగా వివరించారు. పందికోన రిజర్వాయర్ కు ప్రస్తుతం నీటిని నింపతున్న లెక్కన నిర్ధేశిత నీటిని నింపడానికి 464 రోజులు పడుతుంది. కానీ సంవత్సరంలో ఉన్నది 365 రోజులే. అంతే కాకుండా పంట కాలం కూడ 90 నుండి 120 రోజులు. ఈ వ్యవదిలో రిజర్వాయర్ కు నీరు అందించలేకపోతే వ్యవసాయం తిరోగమన దిశగా ఉంటుదని ఆవేదన వ్యక్తం చేశారు. హంద్రీనీవా ప్రాజెక్టులో మొట్టమొదటిగా ఉన్న రిజర్వాయర్ పరిస్థితే ఇలా ఉంటే ప్రాజెక్టు చివరన ముఖ్యమంత్రి ప్రాతినిధ్యం వహిస్తున్న కుప్పం దుస్తితి గురించి వివరించాల్సిన అవసరం లేదని ఆయన పేర్కొన్నారు.

ప్రతి ఎకరాకు నీళ్ళు ఇస్తాం.., ప్రజల దాహార్తిని తీరుస్తాం..., అనే వాగ్ధానాలు రాయలసీమను రత్నాల సీమను చేయలేవు. ఒక అడుగు ముందుకు రెండు అడుగులు వెనకకు లాగా ఉన్న రాయలసీమ సాగునీటి రంగాన్ని తక్షణమే గాడిలో పెట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం లోని వ్యవసాయ యోగ్యమైన భూమిలో 42 శాతం ఉన్న రాయలసీమకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సాగునీటి బడ్జెట్ లో 42 శాతం రాయలసీమకు కేటాయించి, రాయలసీమ సాగునీటి రంగంలో పురోగతిని సత్వరమే సాధించడానికి కృషి చెయ్యాలి. అభివృద్ధి చెందిన ప్రాంతాలతో సమానంగా రాయలసీమ సాగునీటి రంగం అభివృద్ధి చెందడానికి ఈ నిధులతో పాటుగా కేంద్ర ప్రభుత్వం నుండి ప్రత్యేక నిధులు ప్రధానమంత్రి కృషి సించాయ్ యోజన లేదా వేరే ఫథకాల ద్వారా మరియు స్పెషల్ పర్పస్ వెహికల్ ద్వారా లేదా ప్రపంచ బ్యాంకు రుణాల ద్వారా కార్యక్రమాలు చేపట్టాల్సిన అవసరం ఉందని ఆ దిశగా రాష్ట్ర ప్రభుత్వం కార్యాచరణ చేపట్టాలని దశరథరామిరెడ్డి విజ్ఞప్తి చేశారు

# తిరుపతి లడ్డు నెయ్యి కల్తీపై సిట్ ఏర్పాటు

### సిట్ చీఫ్ గా గుంటూరు రేంజ్ ఐజి సర్వశ్రేష్ఠ త్రిపాఠి.



అమరావతి, సెప్టెంబర్ 24, రిపబ్లిక్ న్యూస్, తిరుమల లడ్డూ కల్తీ వ్యవహారంపై ఏపీ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. లడ్డూ తయారీలో కల్తీ నెయ్యిపై విచారణకు సిట్ ను ఏర్పా టు చేస్తూ ప్రభు త్వం ఉత్త ర్వు లు జారీ చేసింది. సిట్ చీఫ్ గా గుంటూరు రేంజ్ ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠిని ప్రభుత్వం నియమించింది. సీట్ లో విశాఖ రేంజ్ డీఐజీ గోపీనాథ్ జెట్టి, కడప ఎస్పీ హర్షవర్ధన్ రాజు మరికొందరు డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలు ఉండనున్నారని సమాచారం.

## ఆరోగ్యశ్రీలో ప్రభుత్వం మెరుగైన వైద్య సేవలు అందించాలి-డివైఎఫ్ఐ



కర్నూల్ సెప్టెంబర్ 24 ( రిపబ్లిక్ న్యూస్):

జిల్లాలో చాలా హాస్పిటల్స్ ఆరోగ్యశ్రీ పేషెంట్ల నుండి మెరుగైన వైద్య సేవలు అందిస్తామనే పేరుతో డబ్బులు వసూలు చేస్తున్నయి ప్రవేట్ హాస్పిటల్స్ పై కఠినమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నగేష్ జిల్లా అధ్యక్షులు రాఘవేంద్ర, జిల్లా సహాయ కార్యదర్శి హుస్సేన్ భాష, అబ్దుల్లా నాయకులు వీరేష్ డీఎంహెచ్ఓ కు వినతి పత్రం అందించారు. ప్రభుత్వం ఆరోగ్యశ్రీలో కొన్ని సర్వీసుల విషయంలో కొన్ని పరిమితులను నిర్దేశించింది అని ప్రవేట్ హాస్పిటల్స్ చెబుతున్నాయి. ఉదాహరణకు ఆరోగ్యశ్రీలో ఈ అద్దాలు వస్తాయి మంచి అద్దాలు కావాలంటే డబ్బులు ఇవ్వాలి అని అడుగు తున్నారు. సిజేరిన్, అర్థో, గుండె సంబంధిత ఆపరేషన్ల విషయంలో కూడా ప్రభుత్వం నుండి తక్కువ వస్తుంది ఆరోగ్యశ్రీలో మీకు ఈ ఆపరేషన్ చేయలేము అదనంగా డబ్బులు ఇస్తే చేస్తామని చెబుతున్నారు. ప్రభుత్వం ఆరోగ్యశ్రీ వర్తించే జబ్బులన్నింటికీ ఎలాంటి రుసుము వసూలు చేయ కుండా పూర్తిస్థాయిలో మెరుగైన వైద్య సేవలు అందించాలని కోరారు. అలాగే జిల్లా కలెక్టర్ ప్రెస్ మీట్ పెట్టి ఆరోగ్యశ్రీ పేషంట్ల నుండి డబ్బులు వసూలు చేసిన హాస్పిటల్స్ పై కఠిన చర్యలు తీసుకుంటామని చెప్పినప్పటికీ కొన్ని హాస్పిటల్స్ ఇంకా డబ్బులు వసూలు చేస్తున్నాయని తెలిపారు.

## బీటు అధికారులకు సెక్షన్ అధికారులుగా పదోన్నతులు




రుద్రవరం,ప్రజా రిపబ్లిక్ న్యూస్ రుద్రవరం రేంజి పరిధిలో గల ఆయా సెక్షన్లలో బీట్ అధికారులుగా విధులు నిర్వహిస్తున్న నలుగురు బీట్ అధికారులకు సెక్షన్ అధికారులుగా పదోన్నతులు పొందారు. రుద్రవరం రేంజ్ పరిధిలో బీట్ అధికారులుగా విధులు నిర్వహిస్తున్న నలుగురికి శిక్షణ అధికారులుగా పదోన్నతులు కల్పిస్తూ అటవీశాఖ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేసినట్లు అటవీశాఖ వర్గాలు తెలిపారు. రుద్రవరం రేంజ్ పరిధిలోని నూతల సెక్షన్ బీట్ అధికారిగా విధులు నిర్వహిస్తున్న రామకృష్ణకు డి వనిపెంట సెక్షన్ అధికారిగా పదోన్నతి కల్పించారు. నూతల సెక్షన్ లో సౌత్ బీట్ అధికారిగా విధులు నిర్వహిస్తున్న నాగేంద్రయ్య మొబైల్ పార్టీ సెక్షన్ అధికారిగా పదోన్నతి కల్పించారు. అహోబిలం సెక్షన్ వీటి అధికారి విజయవర్ధన్ చలమ రేంజి సెక్షన్ అధికారిగా పదోన్నతి కల్పించారు. రుద్రవరం సెక్షన్ లో బీట్ అధికారి డాగ్ స్క్వాడ్ గా విధులు నిర్వహిస్తున్న మాబుఖాన్ కు డాగ్స్ కాల్ సెక్షన్ అధికారిగా పదోన్నతి కల్పించారు. పదోన్నతులు పొందిన నలుగురు సెక్షన్ అధికారులు వారి వారి సెక్షన్లలో బాధ్యతలు చేపట్టనున్నట్లు అటవి శాఖ వర్గాలు తెలిపారు.

# పట్టణంలో క్లీనింగ్‌పై మున్సిపాల్టీ చీటింగ్

మెల్కొనకపోతే ప్రమాదమే

కట్టడికి కదలని పుర సిబ్బంది.

దోమలకు పుట్టినిల్లుగా నంద్యాల మున్సిపాల్టీ.



## పట్టించుకోని ప్రజారోగ్య వ్యవస్థ.

పురపాలికల్లో ప్రజారోగ్య వ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది. కర్నూలు నగరపాలక సంస్థలో ఏటా రూ.50 లక్షలు, నంద్యాలలో రూ.10-15 లక్షలు, ఆదోనిలో రూ.5-10 లక్షల వరకు దోమల నివారణకు ప్రత్యేకంగా ఖర్చు చేస్తున్నారు. డోన్, ఆత్మకూరు, నందికొట్కూరు, ఆళ్లగడ్డ, గూడూరు తదితర పురపాలికల్లో పరిస్థితి మరింత దారుణంగా మారింది. ఇక్కడా ఒక్కో పురపాలికల్లో ఏటా రూ.1-2 లక్షలు ఖర్చు చేస్తున్నా, కేసుల తీవ్రత ఆగడం లేదు. గ్రామీణ ప్రాంతాల్లో పరిస్థితి వర్ణనాతీతం. క్షేత్రస్థాయిలో మాత్రం వాటి ఫలితాలు కనిపించడం లేదు. తొమ్మిది పురపాలికల్లో ఫాగింగ్ యంత్రాలు 20-25, పిచికారీ పరికరాలు 350 వరకు ఉన్నాయి. వీటికి పని చెప్పక చాలా వాటిని మూలన పడేశారు.





## కానరాని ప్రత్యేక కార్యక్రమాలు.

2014-19 మధ్య కాలంలో 'దోమలపై దండయాత్ర' పేరుతో నివారణ చర్యలు చేపట్టేవి. ఇవి ప్రజలను ఎంతో ఆలోచింపజేసేవి. ప్రతి శుక్రవారం ఫ్రై డే.. డ్రై డే నిర్వహించేవారు. దోమలు పుట్టే ప్రాంతాలను గుర్తించి.. నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకునేవారు. ఇక వార్డుల్లో నీటి తొట్టెలు, పాత సామగ్రి, అపరిశుభ్రత, ట్యాంకులను తెరిచి ఉంచడం, టెంకాయ చిప్పలు, టైర్లలో నీరు నిలిచి ఉండటం తదితరాలతో వచ్చే అనర్థాలను జనాలకు వివరించే వారు. వారిలో చైతన్యపర్చే కార్యక్రమాలు చేపట్టేవారు. వైకాపా ప్రభుత్వంలో ఇలాంటివి కనిపించలేదు. కనీసం క్షేత్రస్థాయిలో పరిస్థితి ఎలా ఉంది..? కేసులు వచ్చిన చోట ఏం చేయాలి? భవిష్యత్తు కార్యచరణ ఏమిటి...? అనే ఆలోచన లేకపోయింది.

## నిధులు పక్కదారి.

దోమల నివారణ పేరుతో నిధులు పక్కదారి పట్టించే ప్రయత్నం చేశారు. కంటికి కనిపించే లెక్కలు కావు.. చేసిన పనులకు లెక్కలు వేయలేని పరిస్థితి. దీంతో ఈ విభాగంలో నిధులు పక్కదారి పట్టించారు. కర్నూలు నగరపాలక సంస్థలో ఇంధనం వాడకం పేరుతో సుమారు రూ.లక్షలు జేబులో వేసుకున్నారు. గతంలో ఆదోని పురపాలక సంఘంలో నాసిరకం బ్లీచింగ్, మలాథియన్ ద్రావణం తెప్పించి.. అధిక మొత్తంలో బిల్లులు చేసి, సొమ్ము స్వాహా చేశారు. అన్ని పురాల్లోనూ ఇదే పరిస్థితి నెలకొంది. ఫాగింగ్ పేరుతో తిప్పే వాహనాలకు ఇంధనం కోసం బోగస్ బిల్లులు తయారుచేసి అక్రమాలకు పాల్పడుతున్న సంఘటనలున్నాయి.

ఇప్పటికైనా . స్పందించి నిధులు పక్కదారి పట్టకుండా దుర్వినియోగం చేయకుండా ప్రజల సంక్షేమం కోసం వెచ్చించి దోమల బెడద నుంచి వ్యాధుల నుండి ప్రజలు ఆసుపత్రుల పాలు కాకుండ్గా దోమల పై ప్రత్యేక కార్యక్రమాలు, నివారణ చర్యలు చేపట్టాలని ఉమ్మడి జిల్లా ప్రజలు కోరుకుంటున్నారు.

**బొమ్మల సత్రం, నంద్యాల, సెప్టెంబర్ 24, రిపబ్లిక్ న్యూస్, (సుధీర్)**

వర్షాకాలం లో డెంగీ, టైఫాడ్ కేసులు వెలుగు చూస్తున్నాయి. నగరం, పట్టణాల్లో అపరిశుభ్రత వెంటాడుతోంది. ఏటా పన్నుల రూపేణా ఆదాయం పొందుతున్న పురపాలికలు ఆ స్థాయిలో ప్రజారోగ్యంపై దృష్టి సారించడం లేదు. వీధుల్లో చెత్తాచెదారం పేరుకుపోయినా, తొలగించే పరిస్థితి లేదు. జనం జ్వరాల బారిన పడుతున్నా క్లీనింగ్‌పై దృష్టి పెట్టకుండా మున్సీపాల్టీ చీటింగ్ చేస్తున్నదని పట్టణ ప్రజలు విమర్శిస్తున్నారు. దోమలకు పుట్టినిల్లుగా మారి పట్టణ ప్రజల ప్రాణాలు గాలిలో కలిసిపోతున్న మున్సిపాల్టీలో పట్టించుకునేవారు కరవయ్యారు. మున్సిపాల్టీ పుర యంత్రాంగం మేల్కొనకపోతే జనాలకు రోగాల ముప్పు తప్పేలా లేదనేది స్పష్టమవుతోంది.







**చినుకు రాలింది.. 'ఖాళీ' స్థలాలు.. గుంతల్లో నిలిచిన నీటిలో దోమ పుట్టింది.. పుర సిబ్బంది మేల్కొనకపోతే జనం రోగాలబారిన పడటం ఖాయం.**

## మాటు వేసి ప్రాణాలు కాజేస్తున్న డెంగీ.

ఉమ్మడి జిల్లాలోని పురపాలక సంఘాలతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో 2024 ఏడాది జనవరి నుంచి ఆగష్టు నెలవరకు మొత్తం 192 డెంగీ కేసులు నమోదయ్యాయి. అపరిశుభ్ర వాతావరణంతో ప్రజలలో అవగాహన లేమితో డెంగ్యూ వ్యాధి మాటు వేసి ప్రజల ప్రాణాలను బలి తీసుకుంటుంది. కర్నూలు జిల్లాలో 168, నంద్యాల జిల్లాలో 44 కేసులు వచ్చాయి. మలేరియా కేసులు కర్నూలు జిల్లాలో రెండు వెలుగు చూశాయి. ఈ వర్షాకాలంలో పరిస్థితి తలచుకుంటే ఆందోళన కలిగిస్తోంది.








# జగన్ పాలనలో టీటీడీ ఆస్తుల దోపిడీపై సిబిఐ విచారణ చేయాలి

– మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖర్ రెడ్డి



**జగన్ పాలనలో టీటీడీలో అక్రమాలు జరగలేదని నమ్మితే పులివెందులలో రాజీనామా చేసి మళ్ళీ గెలువాలి. టీటీడీ బోర్డు చైర్మన్ పదవి ఆధ్యాత్మిక గురువులకే ఇవ్వాలి టీటీడీ లడ్డు కల్తీ పై న్యాయవిచారణ జరిపించి ధోషులకు కఠిన శిక్ష వేయాలి రాష్ట్రంలోని హిందూ ఆలయాలకు, ఆస్తులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రక్షణ కల్పించాలి**

**నంద్యాల ప్రతినిధి, సెప్టెంబర్ 24 ,, రిపబ్లిక్ న్యూస్.**

జగన్ పాలనలో తిరుమల తిరుపతి దేవస్థానంలో జరిగిన ఆస్తుల దోపిడీ, అపవిత్రతపై సిబిఐ విచారణ చేయాలని,

టీటీడీ లడ్డు కల్తీ పై న్యాయ విచారణ చేసి ధోషులను కఠినంగా శిక్షించాలని, రాష్ట్రంలోని హిందూ దేవాలయాలకు, ఆస్తులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రక్షణ కల్పించాలని, జగన్ పాలనలో టీటీడీలో అక్రమాలు జరగలేదని జగన్ నమ్మితే పులివెందులలో రాజీనామా చేసి మళ్ళీ ఎన్నికల్లో గెలువాలని, టీడీపీ అధినేత చంద్రబాబు ఆదేశిస్తే శ్రీ వేంకటేశ్వరస్వామి పటంతో పులివెందులలో జగన్ పై తాను పోటీకి సిద్ధం అని మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖర్ రెడ్డి సవాల్ చేశారు.

మంగళవారం నంద్యాల ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి కార్యాలయంలో సీనియర్ టీడీపీ నేత, మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖర్ రెడ్డి విలేకరుల సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా బైరెడ్డి మాట్లాడుతూ వై ఎస్ రాజశేఖర్ రెడ్డి, ఆయన తనయుడు జగన్ పాలనలో తిరుమల తిరుపతి దేవస్థానం అపవిత్రం, ఆస్తుల లూటీ, జరిగిందని, ఎంతో ఘన చరిత్ర, కీర్తి, ఆస్తులు, మహిమలున్న టీటీడీని నిర్వీర్యం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు.

నాస్తికులు, అన్యమతస్థుల పెత్తనంలో టీటీడీ విలవిలలాడిందని, ఆ వేంకటేశ్వరస్వామియే జగన్ పాలనకు విముక్తి కల్పించి సీఎం చంద్రబాబు నాయకత్వంలోని బీజేపీ, జనసేన, టీడీపీ ఉమ్మడి ప్రభుత్వం ఏర్పాటు అయిందని, సీఎం చంద్రబాబు వెంటనే టీటీడీపై దృష్టి పెట్టి విచారణ చేయగా అనేక అక్రమాలు జరిగినట్లు గుర్తించారని,

హిందువులు పవిత్రంగా భావించే ఏడుకొండల వెంకన్న లడ్డులో కూడా జగన్, ఆయన చుట్టూ ఉన్న అన్యమతస్థుల దోపిడీ గ్యాంగ్ లాలూఛీ పడి కల్తీ కి పాల్పడడం క్షమించరాని నేరం అని బైరెడ్డి అన్నారు.

ర్యాడికల్, నాస్తికుడు, మతం మార్చుకున్న భూమన కరుణాకర్ రెడ్డిని చైర్మన్ గా చేసి, టీటీడీ ఈఓ కు అర్హత లేని తన అనుకూల అధికారికి ఈఓ బాధ్యత అప్పగించి జగన్ టీటీడీలో యదేచ్ఛగా భక్తుల కానుకలు దోపిడీ చేశారని, అపవిత్రం చేశారని ఆయన ఆరోపించారు.

తిరుమలలో భూమన కరుణాకర్ రెడ్డి ప్రమాణం చేయడం దెయ్యాలు వేదాలు వళ్ళించినట్లుందని బైరెడ్డి ఎద్దేవా చేశారు. జగన్ తో పాటు వై వి సుబ్బారెడ్డి, భూమన కరుణాకర్ రెడ్డి, ఈఓ ధర్మారెడ్డిలు ముఠాగా ఏర్పడి ప్రత్యేక్షంగా, పరోక్షంగా టీటీడీ నిధులు దోపిడీ చేస్తూ, ఆలయ పవిత్రతను దెబ్బతీశారని బైరెడ్డి మండిపడ్డారు.

రాష్ట్రంలోని ఆలయాలకు, ఆస్తులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రక్షణ కల్పించి, హిందువుల మనోభావాలు కాపాడాలని బైరెడ్డి కోరారు.

ఈ సమావేశంలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డా. కాకరవాడ చిన్న వెంకటస్వామి, టీడీపీ నాయకులు నరహరి విశ్వనాథ్ రెడ్డి, పాండురంగయ్య, మద్దూరు సర్పంచ్ ప్రదీప్ కుమార్ రెడ్డి, వీరేంద్ర సింహారెడ్డి తదితరులు ఉన్నారు.

printed and published by B.Nagendra on behaly of m/s bojja publications # 14-73, Nelliveedhi, Nandyal District, Nadyal printed at Shop No:26, Sri Nidhi Tiffen Centere Opp, Srinivasa Complex, Nandyal (Dist) AP. pin-code - 518501
EDITOR: B.NAGENDRA, RNI No: RNI No:/2023/87888 Phone No: +91 99488 14188, Email id: prajarepublic@gmali.com